
# ఇల్లాలి ఇరవై సూత్రాలు

—మాడుగుల కృష్ణకుమారి



హుషారుగా ఆఫీసునుంచి ఇంటికి వచ్చిన పద్మనాభానికి ఇంటి పరిస్థితిని చూడగానే కొంత ఆశ్చర్యం కలిగింది. ఎప్పుడూ తలుపులు దగ్గర నించుని చిరునవ్వులు చిందించే శ్రీమతికి బదులుగా మూసి వున్న తలుపులు! తలుపులు నెమ్మదిగా త్రోసి పద్మవ్యూహంలోకి జొరబడే అభిమన్యుడిలా లోపలికి పోసాగాడు. ఇల్లంతా నిశ్శబ్దంతో కూడుకొని మనుషులెవరూ లేనట్లు తోచింది. అయినా మెల్లగా బెడ్‌రూంలోకి దారి తీసిన అతని కళ్ళకి ఆలనాటి సత్యభామను మరిపించేట్లుగా కోపగృహంలో ఉన్న తన భార్యామణిని (అలిగినప్పుడు బెడ్‌రూం కోపగృహమే కదా) చూసి ''అలిగితివా సఖీ'' అంటూ వోదార్చుదామనుకునేసరికి నాటి 'కృష్ణపరమాత్మ' జ్ఞాపకం వచ్చి కొంచెం జంకినా ''దేవదేవునికే అవమానం తప్పలేదు. ఇక తానెంత?'' అని గత్యంతరం లేక, మంచంమీద పడుకున్న రాధను నెమ్మదిగా చేత్తో తడుతూ ''రాధా! రాధా!'' అని లేపసాగాడు. భర్త చెయ్యి మీద పడటంతో చటుక్కున లేచి అతని చెయ్యిని విదిలించి కొట్టింది రాధ.

''సారీ రాధా! నే చేసిన తప్పేమిటో తెలిపితే సరిదిద్దుకుంటాను'' అంటూ రాధ చేతులు పట్టుకుని నోటికి వచ్చిన డైలాగులన్నీ వల్లెవేయటం మొదలుపెట్టాడు. రాధా ప్రియుడు. సత్యభామకంటే మరో పాలు ఎక్కువే అయినా భర్త మృదు మధుర సంభాషణలతో అరగంట బ్రతిమాలించుకున్నాక ప్రసన్నురాలైంది రాధ. మారుమాట్లాడక కాఫీ తయారుకి వంటింట్లోకి మౌనంగా నడిచింది. బట్టలైనా మార్చకుండా అదే మంచం మీద ఒరిగిపోయి సిగరెట్టు పొగలు వదుల్తున్న పద్మనాభానికి ఎంత ఆలోచించినా 'సతి' అలుకకు కారణం దొరకలేదు. ప్రస్తుత పరిస్థితిలో కుదిరిన రాజీకి కొంత సంతోషించి కాఫీ కోసం ఎదురుచూడసాగాడు.

*

రెండు రోజులు గడిచిపోయినా ఇంట్లో మౌనం రాజ్యం చేస్తుంటే చిన్నప్పుడు చూసిన 'మూకీ సినిమా' జ్ఞాపకం వచ్చింది పద్మనాభానికి. ఇంతవరకు తలబద్దలు కొట్టుకొని ఆలోచించినా తన తప్పు సూచనగా అయినా తోచటం లేదు తనకి. రోజూలాగా డైనింగ్ టేబిల్‌మీద ప్లేట్ల చప్పుడికి వెళ్ళి ముభావంగా కూర్చున్నాడు భోజనానికి. అన్నీ తనకి ఇష్టమైన పదార్థాలే. అయినా ముభావంగా పెట్టింది తిని, బెడ్‌రూంలోకి జారుకున్నాడు. పన్నెత్తి రాధను పలుకరిద్దామనుకున్నా అలుకవహించి కోపంలో ఉన్నప్పుడు ఆమెను పలుకరిస్తే ఏం జరుగుతుందో తెలుసు కాబట్టి తను కూడా మాట్లాడక దొంగచూపులు చూస్తూ శ్రీమతి కోసం ఎదురుచూడసాగాడు.

ఇల్లు సర్దుకుని మల్లెపువ్వులా తయారయి వచ్చింది బెడ్‌రూంలోకి రాధ. రాధను చూసిన పద్మనాభానికి మనసు రెపరెపలాడినా, మౌనంగా కళ్లు మూసుకుని నిద్ర నటించసాగాడు. అంతకంటె మౌనంగా అటు తిరిగి పడుకుంది రాధ. ఈ రోజన్నా భార్య కరుణిస్తుందేమోనని ఎదురుచూసిన పద్మనాభానికి ఆశాభంగమే అయింది.

అన్నిట్లోను లేడీస్ 'ఫస్టే' అయినా అలక వహించినపుడు భర్తతో మాట్లాడటంలో మటుకు 'లాస్ట్' అనుకుంటూ నెమ్మదిగా ప్రక్కకు తిరిగి రాధ పై చేయి వేశాడు. మునుపటి రెండు రాత్రుల్లా చెయ్యి విదిలించకపోవటంతో, ధైర్యంగా రాజీ కుదిరే సమయం ఆసన్నమైందని రాధకు మరికాస్త దగ్గరగా జరిగి గోముగా ''ఏవిటి రాధా! ఇలా మాట్లాడకుండా సాధిస్తుంటే నాకెలాగో వుంది. నీ కోపానికి కారణం ఏమిటో నాకు తెలియటం లేదు. నీ మాటెప్పుడన్నా కాదన్నానా? నీతో ఎప్పుడన్నా అబద్ధం చెప్పానా?'' అంటూ ఆర్ద్రంగా ప్రశ్నిస్తున్న భర్త మాటల్ని ఖండిస్తూ ''ఆగండి! నాకు అబద్ధాలు చెప్పేవాళ్ళంటే అసహ్యమని మొదటే చెప్పానా!'' అంటూ సూటిగా భర్త ముఖంలోకి చూడటంతో పట్టుబడిన దొంగలా గతుక్కుమన్నాడు పద్మనాభం.

''నా సంగతి తెలిసి కూడా మొన్న రాత్రంతా 'స్పెషల్ డ్యూటీ' అంటూ ధైర్యంగా 'కాక్‌టెయిల్' పార్టీలో ఎంజాయ్‌చేసి తెల్లవారి ఇంటికి వచ్చినందుకండీ నాకీ కోపం, బాధా....'' అంటూ కళ్ళంబడి నీళ్ళు కారుస్తున్న రాధ ముఖంలోకి చూడకుండా తల వంచుకుని ''అయామ్ సారీ రాధా! ఇక ముందెప్పుడూ అలాంటి పార్టీల జోలికి పోను. స్నేహితుల బలవంతం మీద తప్పనిసరిగా వెళ్లవలసి వచ్చింది. నీతో అబద్ధం చెప్పి నీ మనసు నొప్పించాను'' అంటూ ఎలిమెంటరీ స్కూల్ కుర్రాడిలా బుద్ధిగా చెప్తున్న భర్తను చూసి ''మీర జాలగలడా నా యానతి రాధా - పతి'' అని గర్వంగా అనుకొని ఆ ఛాయలు ముఖంలో కన్పడనీయకుండా మౌనంగా ఊరుకుంది. మౌనం సంపూర్ణ అంగీకారంగానే

భావించిన పద్మనాభం లైటార్పి మరి మాట్లాడే తావీయలేదు- రాధకు.

మర్నాడు భర్తను ఆఫీసుకు పంపిన తర్వాత తీరిగ్గా ఆలోచింపసాగింది రాధ. భర్త మనస్తత్వం ఏమిటో అర్థం కాకుండా వుంది. తనకు వచ్చే జీతానికి మించిన ఖర్చుగా వుంది. సిగరెట్లకు, సినిమాలకి, హోటళ్ళకి, ఆటోలకు ఖర్చు అంతులేకుండా వుంది. దానికి తోడు ఈ పార్టీల నెపంతో 'అది' కూడా అలవాటవుతోంది. తన భర్త పొగరుబోతా?—అంటే అదీ కాదు. ఆయనన్నట్లుగా నా మాట ఎప్పుడూ జవదాటరు. స్నేహితులవల్ల కొంత పాడవుతున్నారు కాని లేకపోతే స్వతహాగా ఏ చెడ్డ అలవాట్లు లేవు. "దీనికి పరిష్కార మార్గం ఏదైనా ఆలోచింపగలగాలి" అనుకుంటున్న రాధ బుర్రలో ఒక ఆలోచన తళుక్కుమంది. వెంటనే కాగితం కలం తీసుకుని వ్రాయసాగింది.

*

భార్యాభర్తలిరువురూ ఆనందంగా కబుర్లు చెప్పుకుంటున్న సమయంలో "ఏవండీ నాదొక చిన్న కోరిక" అంటూ ప్రేమగా భర్త ముఖంలోకి చూసింది రాధ.

"ఓయస్! ఎన్ని కోరికలైనా కోరుకో. వెంటనే తీర్చేస్తాను."

"ప్రామిస్!"

"ప్రామిస్!" అన్నాడు పద్మనాభం.

ఇదే సమయమనుకుని "దీల్లో వున్నవన్నీ మీరు తూ. చా. తప్పక అమలుపరచాలి. ఇది మన జీవితానికే ఒక కొత్త వెలుగు. లేకపోతే నా మీద ఒట్టే" అంటూ ఓ కాగితం అందించింది రాధ.

"భార్యకు తనపై ప్రేమ ఎక్కువైనప్పుడల్లా తన కోర్కెలను ఇలాంటి కాగితాలపై వ్రాసి తనకివ్వటం మామూలే కదా!" అనుకుంటూ ఆమె కోర్కెల కాగితం చదవసాగాడు పద్మనాభం.

1. వచ్చే జీతాన్ని పొదుపుగా వాడుకుంటూ అప్పులు చెయ్యకుండా నెలంతా గడుపుకోవాలి.
2. సిగరెట్లకు, పేకాట్లకు స్వస్తి చెప్పాలి. కారణం—అనారోగ్యానికి, వ్యసనానికి దాసులవుతారు కాబట్టి.
3. రోజూ ఆఫీసుకు బస్సు మీదనే వెళ్ళాలి. లేదా ఓ సైకిల్ కొనుక్కోవాలి.
4. అవసరం (మరీ) ఐతేనే తప్ప, హోటళ్లకు పోరాదు. ఇంటి వద్దనే టిఫిన్ తినాలి.
5. నెలకు రెండుసార్లు మాత్రమే సినిమాలు చూడాలి. స్నేహితులు బలవంతపెట్టినా ఏదో సాకుతో తప్పించుకోవాలి.
6. ఆదివారాలు భార్యతో ఇంటి దగ్గరే గడపాలి. పిక్నిక్ నెపంతో స్నేహితులతో అడ్డమైన చోట్లకు పోరాదు.
7. కాక్ టెయిల్ పార్టీలకు ఖచ్చితమైన ఉద్వాసన చెప్పాలి.
8. అయిందానికీ, కానిదానికీ భార్యపై చిరాకు పడకూడదు.
9. ముఖ్యంగా పొరపాట్లుచేసి భార్యతో అబద్ధాలు చెప్పకూడదు.
10. సాధ్యమయినంతవరకు మనకందుబాటులో వున్న పనులన్నీ మనమే చేసుకోవాలి.
11. ఆఫీసు వదలగానే స్నేహితులతో బాతాఖానీ కొట్టకుండా తిన్నగా ఇంటికే రావాలి.
12. ఇంటికి కావలసిన సరుకులన్నీ సొంతంగా తెచ్చుకోవాలి. (ఆఫీసులో ప్యూన్లను పంపితే కమీషన్లు కొడతారు కనుక)
13. తీరిక రోజుల్లో భార్యాభర్త లిరువురూ షికారుకో, లేక బంధువుల ఇళ్ళకో వెళ్ళాలి.
14. ఇద్దరికీ సంసారంపట్ల బాధ్యతలు సమానమే కనుక భర్త కూడా బాధ్యత కల్గిన మనిషిగా ప్రవర్తించాలి.
15. జీవితం ఆనందమయం చేసుకోవాలి కనుక మిత సంతానం అతి ముఖ్యంగా పాటించాలి.
6. భార్య కోరికలు పరిమితి దాటకుండా ఉంటే తప్పక నెరవేర్చాలి.
17. భార్యకు తగిన గౌరవం, ఆమె మాటలకు విలువ ఇవ్వాలి. ఎవరన్నా స్నేహితులు గేలి చేస్తుంటే భార్యమీద నెపం నెట్టకుండా తనే సమర్థించుకోవాలి.
18. గృహాన్ని స్వర్గసీమగా చేసి "పతియే ప్రత్యక్ష దైవం" అని ఋజువు చెయ్యాలి.
19. ఆఫీసుకు వెళ్ళేటప్పుడు తగినంత డబ్బు మాత్రమే తీసుకుని వెళ్ళాలి.
20. పొదుపు ప్రస్తుత కర్తవ్యం కాబట్టి ఒక 'బ్యాంక్ ఎకౌంట్' ఓపెన్ చెయ్యాలి.

కాగితం చదవటం పూర్తి చేసిన పద్మనాభం "ఆచరణ యోగ్యములేనా?" అన్నట్లు భార్య ముఖంలోకి ఇబ్బందిగా చూశాడు.

"అవునండీ! మీరు మన కుటుంబం పట్ల చాలా నిర్లక్ష్యంగా ఉంటున్నారు. డబ్బు ఎలా దూబరా చేస్తున్నారో తెలుసా? మన మిద్దరమే వచ్చే జీతంతో 'మేనేజ్' చేసుకోలేకపోతే రేపు పుట్టే మన పిల్లల భవిష్యత్తు మాటేమిటి? ఇలా అప్పుల్లో మునిగితే మనం తేలేదెప్పుడండీ?" అంటూ చిరునవ్వుతో చెబుతున్న రాధ మాటలకు అవాక్కయి పోయాడు పద్మనాభం.

